సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 21 । జూలై । 2025



స్టాపింగ్ కోసం నిరీక్షణ!

ఓబులవారిపల్లెలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్టాపింగ్ ఎత్తివేసి ఐదు నెలలైంది. రైల్వే అధికారులు, నాయకులు స్టాపింగ్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. -8లో



అరాచకపాలన రాజ్యామేలుతోంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకపాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి విమర్శించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.180	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 550 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 21వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

జేఎన్‌టీయూ హాస్టల్ పరిశీలన



జేఎన్టీయూ బాలికల మెస్‌ను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి: కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల బాలికల హాస్టల్‌లో శనివారం ఉదయం విద్యార్థినుల అల్పాహారంలో బల్లి పడి ఘటనకు సంబంధించి స్పందించిన మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆదివారం కళాశాలకు చేరుకుని బాలికల మెస్‌ను తనిఖీ చేశారు. అయితే బాలికల ప్లేటులో మాత్రమే బల్లి పడిందని, సాంబారులో పడలేదని మెస్ నిర్వాహకులు వారికి తెలిపారు. మెస్ గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎలాంటి అపరిశుభ్రతకు తావులేకుండా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుధాకర్, హెచ్‌ఏ షఫీ, సిబ్బంది జగన్‌మోహన్, మాధవి, హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న సర్తాజ్ హుస్సేన్

రాజంపేట టౌన్: విద్యార్థులు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని అలవరుచుకుంటే చదువులో రాణించగలరని ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ తెలిపారు. ఈనెల 31వ తేదీ ప్రముఖ హిందీ నవలాకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక బీవీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రేమ్‌చంద్‌కి జీవని అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్తాజ్ హుస్సేన్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నారు. అప్పుడే తమలోని ప్రతిభ ఏమిటన్నది తెలుస్తుందన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 31వ తేదీ ప్రేమ్‌చంద్ జయంతి రోజున బహుమతులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, రాజశేఖర్, సైరాభాను తదితరులు పాల్గొన్నారు.

నిరసన గళం!

- ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసు నమోదుపై ఆగ్రహం
- కూటమి వైఖరిని తప్పుపట్టిన నేతలు
- కక్ష సాధింపుచర్యల్లో భాగంగానే కూటమి సర్కార్ చర్యలు
- పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా వైఎస్సార్ సీపీ శ్రేణులు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్‌కు సంబంధించి ఓటమి లేకుండా వరుస గెలుపులతో రికార్డు సృష్టిస్తున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై అధికార పార్టీ కన్నుపడింది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ కీలక నేతలను మద్యం కేసు పేరుతో అరెస్టు చేసి పలువురిని జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే రాయలసీమలో రాజకీయంగా మంచి పట్టు ఉన్న పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షపూరితంగా ప్లాన్ చేసి ఇరికించారు. అంతకు ముందు జిల్లాలోని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసులోనూ ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబాన్ని ఇరికించేలా పన్నాగం పన్నారు. అయితే అప్పట్లో సీఎంఓ ఆదేశాలతో సీఐడీ విచారణ చేసినా పెద్దగా ఫలితం లేకపోవడంతో మద్యం కేసులో అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విచారణ అనంతరం ఎంపీని అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించడంపై జిల్లాలో పార్టీ శ్రేణులు నిరసన తెలియజేశారు.

పార్టీ కార్యాలయాల వద్ద నిరసన

రాజంపేట లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి..అన్యాయంగా, అక్రమంగా ఇరికించి అరెస్టు చేశారంటూ ఆదివారం పార్టీ నాయకులు మీడియా సమావేశాల్లో కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఎక్కడికక్కడ స్థానికంగా ఉన్న పార్టీ కార్యాలయాల్లో నిరసనలు తెలియజేయడంతోపాటు ప్రభుత్వ వ్యవహారశైలిని తప్పుబట్టారు. జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె, మదనపల్లె ఇలా అన్నిచోట్ల ఎంపీ అరెస్టును పార్టీ నేతలతో పాటు శ్రేణులు తీవ్రంగా ఖండించాయి.



కలికిరి మండలంలో ఎంపీ అరెస్టుకు నిరసన తెలియచేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కడిగిన ముత్యంలా బయటికి వస్తారు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఏ తప్పు చేయలేదని....విచారణ అనంతరం రానున్న కాలంలో కడిగిన ముత్యంలా ఆయన బయటికి రావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. రాజంపేటలో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయచోటిలో మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డెప్పగారి రమేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, తంబళ్లపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, పీలేరులో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్, రైల్వేకోడూరులో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టును ఖండించారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కుట్ర పూరిత వ్యవహారానికి పూనుకున్నారని వారు విమర్శించారు.

పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూటమి సర్కార్‌పై రగిలిపోతున్నాయి. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు కలకలం రేపింది. పార్టీ శ్రేణులు ఇతర నేతలంతా సీఐడీ విచారణకు హాజరైనా తిరిగి పంపిస్తారనుకునే లోపే అరెస్టు ప్రకటన అలజడి సృష్టించింది. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులను ఒక్కొక్కరినీ అరెస్టు చేస్తుండటంతో ఆగ్రహం మీద ఉన్న పార్టీ శ్రేణులకు ఎంపీ అరెస్టును జీర్ణించుకోలేకపోతున్నారు. ఎవరు వెళ్లినా అందరినీ ఆప్యాయంగా పలుకరించి కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఎంపీని అరెస్టు చేయడంపై పార్టీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. మొత్తం మీద ఎంపీ అరెస్టుపై పార్టీ శ్రేణులు తీవ్రంగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి.

బాబు దుర్మార్గానికి పరాకాష్ట



కుట్రలు పన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయించడం చంద్రబాబు నాయుడు దుర్మార్గానికి పరాకాష్ట. చంద్రబాబు నాయుడు వ్యవస్థలన్నింటినీ నాశనం చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నాడు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబునాయుడు విష సంస్కృతికి తెరతీశాడు. ఇది ప్రజాస్వామ్యానికి ఏమాత్రం సరైనది కాదు. ఎంపీ గా ఉన్న మిథున్ రెడ్డికి మద్యం వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేదు., అలాంటిది మద్యం స్కాం పేరిట అరెస్ట్ చేయడం రాజకీయ అరెస్ట్ అన్న విషయం తేటతెల్లం అవుతోంది. -ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రాజకీయ కక్షతోనే..



టీడీపీ నేతలు కుట్రలు, కుతంత్రాలతో ఎన్ని కేసులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ నేత, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నేతల పైన తప్పుడు కేసులు పెడుతోంది. మిథున్ రెడ్డిని, ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు పెట్టారు. ఆధారాలు లేని తప్పుడు కేసులు న్యాయస్థానాల ముందు నిలబడవు. - కె మహిత, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ

రెడ్ బుక్ రాజ్యాంగంతో అక్రమ కేసులు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి...రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తోంది. యాక్టివ్ గా ఉన్న నాయకులపై ఒక పథకం ప్రకారం గోబెల్స్ ప్రచారం చేస్తూ... కట్టుకథలు అల్లుతూ తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలు ప్రమాదకరం. కూటమి నాయకులు పెట్టిన తప్పుడు కేసులు కోర్టులో నిలబడేవి కావు.. వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. -దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాజకీయంగా ఎదుర్కోలేకనే..



పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక తప్పుడు కేసులతో అరెస్ట్ చేసి కూటమి ప్రభుత్వం రాక్షస ఆనందం పొందుతోంది. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను అణిచివేతకు గురి చేస్తున్నారు. నేడు అది తారాస్థాయికి చేరుకుంది. ఆవేదన వ్యక్తం చేశారు. లేని లిక్కర్ స్కాంలో ఎంపీ మిథున్ రెడ్డి పైన అక్రమ కేసు పెట్టారని, ఇది కోర్టులో చెల్లుబాటు కాదని తెలిసి పైశాచిక ఆనందం కోసం అక్రమ అరెస్టు చేశారు.న్యాయ పోరాటం చేస్తూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులపై ప్రజలకు తెలియజేస్తాం. -నిస్సార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త

అక్రమ అరెస్టులు భయపెట్టలేవు



కూటమి ప్రభుత్వం వైయస్సార్సీపి నేతలను టార్గెట్ చేస్తూ పెడుతున్న అక్రమ కేసులు, అరెస్టులు భయపెట్టలేవు. నిగర్వి, ప్రజా సేవకుడైన మిథున్‌రెడ్డిపై లిక్కర్ స్కాం పేరుతో నిరాధారణమైన కేసులను బనాయించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్ రెడ్డి పైన కూడా రాజకీయ ఆరోపణలను పరిగణలోకి తీసుకొని లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసు నమోదైంది. పోలీసులు వెంటనే రమేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని రాయచోటి నుంచి మదనపల్లికి తరలించడం రాజకీయ కక్షలో భాగమే. -శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అరెస్టులే కూటమి మేనిఫెస్టోనా?



రాష్ట్రంలో కూటమికి ప్రజలు అక్రమ అరెస్టులకు మాత్రమే అధికారమిచ్చినట్లు ఉంది. వైఎస్సార్‌సీపీ నేతలకు వేధింపులే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటైందా... అక్రమాలు.. అరెస్టులు, జైల్లకు తరలించడమే కూటమి మేనిఫెస్టోనా అన్నట్లు పాలన సాగుతోంది. రాబోయే రోజులలో కూటమి నేతలు ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబ ఎదుగుదలను ఓర్వలేకనే ఈ విధంగా వేధింపులు కొనసాగిస్తున్నారు. - చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పీలేరు

నియంతృత్వ పోకడ మంచిది కాదు



కూటమిప్రభుత్వం దురుద్దేశంతో, కక్షపూరితంగా పెడుతున్న తప్పుడు కేసులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కూటమిప్రభుత్వ కుట్రలు పరాకాష్టలకు చేరాయి.మద్యం కేసు పేరుతో ఇష్టానుసారం కేసులు పెడుతూ, కట్టుకథ అల్లి, దాని ప్రకారం ఒకొక్కరినీ అరెస్ట్ చేస్తూ ముందుకెళుతున్నారు.కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడ మంచిది కాదు. -నరేష్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

ప్రజాస్వామ్యంపై దాడి



అక్రమ కేసుతో ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే. రాజకీయ కుట్రలతో, లిక్కర్ స్కామ్ ఆరోపణలతో అన్యాయంగా అరెస్ట్ చేయడం దుర్మార్గం. ఇది ప్రజా స్వామ్య వ్యవస్థపై విరుద్ధమైన చర్య. అరాచక చర్యలను ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా ఖండించాలి. -యండపల్లె శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

శాకంబరీ..నమోస్తుతే



శాకంబరీ దేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆదివారం ఆషాఢమాసం చివరి వారం కావడంతో అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలు, ఆకుకూరలతో అలంకరించారు. మండలంలోని సమరసత సేవాఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు చీరె,సారెలు తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతాన ప్రాప్తి కోసంమహిళలు అమ్మవారి ఆలయ పరిసరాల్లోన కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మంజులు, సిబ్బంది పాల్గొన్నారు. -గుర్రంకొండ

'పాలకొండ'లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా కడప నగర శివార్లలోని శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో ఆదివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయం, అంతరాలయం,షోడశ మండపం, ఆలయ ప్రాంగణం, ప్రాకారపరిసరాలను ఆలయ సేవకులు, అధికారులు స్వచ్ఛందంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ పరిసరాలలో ఉన్నటువంటి చిన్న కోనేరు ,పెద్ద సెలయేరు, ఆలయ చుట్టుపక్కల పరిసరాలలో ఉన్నటువంటి అపరిశుభ్ర వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కడప నగరానికి చెందిన శ్రీ భువనేశ్వరి మాత సేవా సమితి సేవకులు, శ్రీ సుముఖీ అన్నపూర్ణేశ్వరి సేవా సమితి సభ్యులు,ఆలయ అర్చకులు యోగేశ్వర శర్మ, ఆలయ చైర్మన్ రెడ్డయ్య యాదవ్, స్వామివారి భక్తులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో టెన్షన్..టెన్షన్..

- మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడి ప్రచారంతో మోహరించిన ఇరువర్గాలు
- పోలీసుల అలర్ట్



రమేష్ కుమార్ రెడ్డి నివాసం వద్ద వైఎస్సార్సీపీ శ్రేణులను వారిస్తున్న సీఐ వెంకట కొండారెడ్డి

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం టెన్షన్ వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా టీడీపీ, వైఎస్సార్‌పీ శ్రేణులు మోహరించడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయం నెలకొంది. సీఎం చంద్రబాబు, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపై రాజకీయ విమర్శలు చేశారనే సమాచారంతో మంత్రి అనుచరులు రమేష్‌రెడ్డి ఇంటి పైన దాడికి వస్తున్నట్లు నియోజకవర్గ వ్యాప్తంగా సమాచారం వ్యాపించింది. దీంతో రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు రాయచోటి మండలాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున లక్కిరెడ్డిపల్లి చేరుకున్నారు. ఇదే క్రమంలో మంత్రి సోదరుడు, స్థానిక టీడీపీ నేతలు రావిచెట్టు వైపు నుంచి భారీ వాహన కాన్వాయ్ తో చేరుకున్నారు. ఇరు వర్గాల మోహరించారన్న సమాచారాన్ని అందుకున్న పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపై రాజకీయ విమర్శలు చేశారనే నెపంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డిపై లక్కిరెడ్డిపల్లె టీడీపీ నాయకుడు మదన్ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకట కొండారెడ్డి తెలియజేశారు. పోలీసుల వివరాల మేరకు చంద్రబాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా చిన్నమండెం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డిలపై తప్పుగా మాట్లాడటంపై టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. రమేష్ రెడ్డిపై అక్రమ కేసు బనాయించడంపై పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా కేసులు నమోదు చేయడం, భయభ్రాంతాలకు గురి చేయడం బాధాకరమని అన్నారు.



రమేష్ కుమార్‌రెడ్డి అరెస్ట్ తెలుసుకున్న వెంటనే ఆయన నివాసం వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఉజ్వల భవితకు నవోదయం

- దరఖాస్తులకు అవకాశం
- ఈనెల 29న చివరి గడువు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

మదనపల్లె సిటీ: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత భోజనం,వసతితో అత్యుత్తమ విద్యనందిస్తున్న జవహర నవోదయ విద్యాలయాల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. జిల్లాలో మదనపల్లె సమీపంలోని వలసల్లెవద్ద జవహర్ నవోదయ విద్యాలయ, రాజంపేటలోని నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత సాధిస్తే 6 వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య చాలా కీలకమైంది. పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నవీన విద్యను అందించాలన్న ఉద్దేశంతో జవహర్ నవోదయ విద్యాలయాలను నెలకొల్పారు. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 29వతేదీతో గడువు ముగియనుంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

దరఖాస్తులు ఇలా...

- జవహర్ నవోదయ విద్యాలయాలకు విద్యార్థులు www.cbseitems.rcl.gov.in/nvs అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మదనపల్లె నవోదయకు ఉమ్మడి చిత్తూరు జిల్లా, రాజంపేట నవోదయకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వారై ఉండాలి.
- ప్రవేశపరీక్ష రాయబోయే విద్యార్థి ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- మదనపల్లె నవోదయ పాఠశాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా, రాజంపేట నవోదయ పాఠశాలకు ఉమ్మడి కడప జిల్లా ప్రాతిపదికన అడ్మిషన్లను పరిగణలోకి తీసుకుంటారు.



మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయ

రిజర్వేషన్లు ఇలా...

- ఎస్సీలకు 15 శాతం
- ఎస్టీలకు 7.5 శాతం
- దివ్యాంగులు 3 శాతం
- బాలికలు 33 శాతం

ఇవీ సౌకర్యాలు: సువిశాలమైన పాఠశాల ప్రాంగణం, శాశ్వత తరగతి గదులు, డిజిటల్ పాఠాలకు ప్రత్యేక ఏర్పాట్లు, ఆధునాతన కంప్యూటర్ ల్యాబ్, బాల,బాలికలకు విడివిడిగా వసతి గృహాలు, ఉదయం యోగా, వ్యాయామం సాధన, కూచిపూడి, యోగా, చిత్రలేఖనం, సంగీతం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస స్కౌట్స్ అండ్ గైడ్స్ ,పలు క్రీడల్లో శిక్షణ ఇస్తారు. పాఠ్యాంశాలతో పాటూ విజ్ఞానాన్ని పెంపొందించే ఎన్నో పుస్తకాలతో కూడిన గ్రంథాలయం, పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది.

పరీక్ష ఇలా....

పరీక్ష రకం	ప్రశ్నల సంఖ్య	మార్కులు	సమయం (నిమిషాలు)
మేధాశక్తి	40	50	60
అంకగణితం	20	25	30
భాషా పరీక్ష	20	25	30

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు



నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరుగుతాయి. ఎలాంటి సిఫార్సులకు తావుండదు. తల్లిదండ్రులు, విద్యార్థులు అపోహలకు లోనవ్వకుండా అప్రమత్తతతో ఉండాలి. పరీక్ష విధానం, ఎంపిక ప్రక్రియ మొత్తం పాదర్శకంగా ఉంటుంది. ప్రవేశం పొందే విద్యార్థులు 6వ తరగతి నుంచి 12వతరగతి వరకు ఎలాంటి ఖర్చు లేకుండా విద్యాభ్యాసం సాగించవచ్చు. దరఖాస్తులు గడువులోగా పూర్తి చేసి సద్వినియోగం చేసుకోవాలి. -గీత, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, మదనపల్లె

జర్నలిజం కోర్సులో నేరుగా ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 21 నుంచి 31 తేదీ వరకు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్ తెలిపారు.జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ జరగనుందని తెలిపారు. పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తర్ణీత సాధించినవారు అర్హులని చెప్పారు. కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు యోగి వేమన విశ్వవిద్యాలయం www.yvu. edu.in ను సందర్శించాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

ఫోన్లో మాట్లాడొద్దంటే విద్యార్థి అదృశ్యం


మేఘన (ఫైల్)

బి.కొత్తకోట : డిగ్రీ చదువుతున్న కుమార్తె ఫోన్‌లో మాట్లాడటం చూసిన తండ్రి మందలించాడని అదృశ్యమైన ఉదంతం బి.కొత్తకోటలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు. స్థానిక బీసీ కాలనీకి చెందిన వెంకటాద్రి కుమార్తె మేఘన (19) డిగ్రీ రెండో ఏడాది చదువుతోంది. శనివారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వచ్చిన మేఘన ఫోన్లో మాట్లాడుతుండగా వెంకటాద్రి మందలించాడు. దీనికి మనస్థాపం చెందిన మేఘన ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు పలుచోట్ల ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు


గాయపడిన మునిరాజ

మదనపల్లె రూరల్ : ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం చౌడేపల్లి మండలంలో జరిగింది. సోమల మండలం నెల్లిమందకు చెందిన గంగులప్ప కుమారుడు మునిరాజ (27), తన మరదలు రెడ్డి ఈశ్వరి (18)తో కలసి ఆటోలో పొట్టేలు వేసుకుని బోయకొండలో మొక్కు చెల్లించుకునేందుకు బయలుదేరారు. ఆటో బోయకొండ సమీపంలోకి రాగానే లోపల ఉన్న పొట్టేలు హఠాత్తుగా బయటకు దూకింది. దానిని అదుపు చేసేందుకు ప్రయత్నించిన మునిరాజ, ఆటో డ్రైవింగ్‌పై అదుపు తప్పడంతో వాహనం బోల్తా పడి, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

చెరువులో జారి పడి గొర్రెల కాపరి మృతి


గొర్రెల కాపరి మృతదేహం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు వ్యాసరాయ చెరువులో ఓ గొర్రెల కాపరి ఆదివారం ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లికి చెందిన చిన్నకోట్ల మారప్ప (62) తన గొర్రెలను శుభ్రం చేసేందుకు చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు జారి చెరువులో గల్లంతయ్యాడు. తోటి కాపరులు విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పీటీఎం ఎస్ఐ హరిహర ప్రసాద్, ములకలచెరువు ఫైర్ సిబ్బంది హుటాహుటిన చెరువు వద్దకు చేరుకుని శవం కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. గతంలో గుర్తు తెలియని వ్యక్తులు చేపల కోసం వదలిన వలలో ముళ్ల చెట్టు వద్ద శవం చిక్కుకున్నట్లు ఫైర్ సిబ్బంది గుర్తించారు. చెరువులోని ముళ్లచెట్టుకు తాడు వేసి శవాన్ని వెలికి తీశారు.

స్టాపింగ్ కోసం నిరీక్షణ !

- ఓబులవారిపల్లె జంక్షన్‌పై రైల్వేశాఖ శీతకన్ను
- ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఎత్తేయడంతో అవస్థలు
- జాతీయ స్థాయి నాయకులున్నా ఫలితం శూన్యం


ఓబులవారిపల్లెలో స్టాపింగ్ ఉన్నప్పుడు నిలిచిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (ఫైల్)



ఓబులవారిపల్లె జంక్షన్ పేరు కూడా మార్చని రైల్వే శాఖ అధికారులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేసి దాదాపు ఐదు నెలలు అయింది. రైల్వే అధికారులు కాని నాయకులు కాని స్టాపింగ్ పునరుద్ధరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి రైల్వే చరిత్ర కలిగిన ఓబులవారిపల్లె రైల్వే పరంగా జంక్షన్ కాక ముందు నుంచి దశాబ్దాలుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఉండేది. ఇక్కడి నుండి చె విలువైన కలపను చెన్నైకి రవాణా చేస్తుండేవారు. అప్పట్లో ఎలకంటి సుబ్బయ్య శ్రేష్టి అనే సామాన్య వ్యక్తి రైల్వేశాఖ అధికారులతో పోరాడి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా రాయలసీమ, జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆగేవి. కాలక్రమేణా వెంకటాద్రి, రాయలసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లు ఆగేవి. టీడీపీ రైల్వే కోడూరు ఇన్‌చార్జి, రైల్వేకొడూరు ఎమ్మెల్యే, జనసేన పార్టీ, బీజేపీ జాతీయ స్థాయి నాయకులు మండల కేంద్రానికి చెందిన వారే. అయినా ఐదు నెలలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించినా వారు ఏమీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పట్టించుకోని రైల్వే శాఖ..

మండలం నుంచి చిట్వేలి, రాపూరు, వెంకటాచలం మీదుగా రైలుమార్గం ఏర్పాటు చేయడంతో ఓబులవారిపల్లె జంక్షన్ అయింది. రైల్వేపరంగా అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అభివృద్ధి మాట దేవుడెరుగు ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కూడా ఎత్తివేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ మార్గంలో నంద్యాల మీదుగా గుంటూరుకు, రేణిగుంట మీదుగా కన్యాకుమారి, చెన్నై, విశాఖపట్టణానికి రైళ్లు నిత్యం ప్రయాణిస్తున్నాయి. అయితే చాలా ఎక్స్‌ప్రెస్ రైళ్లు రేణిగుంట, కడపలో గంటల తరబడి నిలబడుతున్నాయి. అలాంటి ఎక్స్‌ప్రెస్‌లకు రెండు నిమిషాల పాటు ఓబులవారిపల్లెలో హాల్టింగ్ కల్పిస్తే రైల్వే శాఖకు ఎలాంటి నష్టం ఉండదు. కడప నుండి హరిప్రియ ఎక్స్‌ప్రెస్ ఉదయం 4.45 నిమిషాలకు బయలుదేరి నందలూరుకు 5.10కి చేరుకుంటుంది. అక్కడ 20 నిమిషాల పాటు ఉంటుంది. రేణిగుంట నుండి తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆపై గుంతకల్లుకు వెళ్లే రైలు రేణిగుంటలో 4.58కి బయలుదేరి కడపకు 7 గంటలకు చేరుకుంటుంది. అక్కడ 45 నిమిషాలు హాల్టింగ్ అనంతరం గుంతకల్లుకు బయలుదేరుతుంది. అదేవిధంగా గుంటూరు ఎక్స్‌ప్రెస్ రెండు రైళ్లు నంద్యాల రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా ప్రతి రోజు నిలబడుతున్నాయి. ఇలా ఇంకా చాలా ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వాటికి రెండు నిమిషాలు హాల్టింగ్ కల్పిస్తే రైల్వేశాఖకు నష్టం లేదకపోగా ఇంకా ఆదాయం పెరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఓబులవారిపల్లె జంక్షన్‌గా మారి ఐదేళ్లయినా కనీసం బోర్డులో కూడా జంక్షన్ అని పేరు మార్చలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది.

ప్రయాణికుల అగచాట్లు

మండలంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బెరైటీస్ గనులు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఖనిజం విదేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. ఏపీఎండీసీ మంగంపేట కార్యాలయంతో పాటు దాదాపు 150 పల్వరైజింగ్ మిల్లులు, చిన్న పరిశ్రమలు ఉన్నాయి. చాలామంది వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా బొప్పాయి, అరటి, తమలపాకు, మామిడి తదితర పంటలను రైతులు సాగుబడి చేస్తుంటారు. వారు చెన్నై, ముంబై తదితర నగరాలకు నిత్యం వెళ్లాల్సి ఉంటుంది. నగరాలలో చదువుల కోసం, ఉద్యోగులు తమ విధుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించడంతో వారంతా రైల్వేకోడూరు, రాజంపేటకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు స్పందించి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ కల్పించాలి



ఐదు నెలలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలబడటం లేదు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఆసుపత్రులకు తిరుపతికి, హైదరాబాదుకు వెళ్లలన్నా రైళ్లు చాలా అనుకూలంగా ఉండేవి. దూర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణాలు సాగించలేము. ఇప్పటికైనా నాయకులు స్పందించాలి.

– ఆర్. వెంకటేష్, రైతు, వై.కోట, ఓబులవారిపల్లె.

ఎంపీ చొరవతో గతంలో స్టాపింగ్



కోవిడ్ అనంతరం స్టాపింగ్‌లు ఎత్తి వేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో రైల్వే మంత్రిని కలిసి రెండు సార్లు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించారు. ఈ విషయంపై ఎంపీ ఇప్పుడు కూడా ఢిల్లీలో రైల్వే శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు, రైల్వేశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్, ఓబులవారిపల్లె.

సిమెంట్ రోడ్డు ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీ నాయకులపై కేసు

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లే సిమెంట్ రోడ్డు ధ్వంసం ఘటనపై పడమర అనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులైన నందిమండలం మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు బాల సుబ్బారెడ్డి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లేదారిలో ఐదేళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించారని, ఈ స్థలం తమదని శనివారం మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు రోడ్డును తొలగించడంపై అక్కడి దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైంది

– ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి


ప్రతిభ చాటిన విద్యార్థికి అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, సీఈఓ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్ : వృత్తుల్లో కెల్లా నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప సాయికృప నర్సింగ్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన, ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్లు, నర్సులు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సాయిబాబా విద్యాసంస్థల సీఈఓ ఎంవీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకుని చదవాలని కోరారు. ప్రజలకు సేవచేయడానికి నర్సింగ్ వృత్తి దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యావతి మాట్లాడుతూ సాయికృప నర్సింగ్ కళాశాలలో అనేక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ నర్సింగ్ సూపరింటెండెంట్లు రమణమ్మ, కాంతమ్మతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చింతచెట్లు అక్రమంగా నరికివేత


టి.రాచపల్లెలో చింతచెట్లను నరికి వేసిన దృశ్యం

గుర్రంకొండ : మండలంలోని టి.రాచపల్లె పంచాయతీలో చింతచెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని టి.రాచపల్లె కస్పా, ఎగువ బురుజుపల్లె, దిగువ బురుజుపల్లె గ్రామాల్లో 25 చింతచెట్లను అక్రమంగా నరికివేశారు. తమిళనాడుకు చెందిన కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ భూముల్లోనూ, దేవుడి మాన్యం భూములు, వంక పోరంబోకు భూముల్లో అక్రమంగా చింతచెట్లను నరికి వేసి వారి రాష్ట్రాలకు లారీల్లో తరలించుకుపోతున్నారు. రెవెన్యూ, అటవీశాఖకు చెందిన అధికారుల అనుమతి లేకుండా ఇష్టానుసారం చెట్లను నరికివేసి తరలించేస్తున్నారు. చింతచెట్ల నరికివేతపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఆర్ఐ సదాశివను వివరణ కోరగా గ్రామస్తులు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమన్నారు. వీఆర్ఓను పంపించి ఉన్న కట్టెలను తరలించకుండా సీజ్ చేశామన్నారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలన రాజ్యమేలుతోంది

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకపాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి విమర్శించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడమే పరమావధిగా పెట్టుకొని ఈ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపి ఆనందించడం వారికి పరిపాటిగా మారిందన్నారు. లేని మద్యం కేసును సృష్టించి, తప్పుడు విచారణలు చేస్తూ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఇలా విపక్ష నేతలపై కేసులు పెట్టుకుంటూ పోతే దానికి అంతే ఉండదన్నారు. రాబోవు రోజుల్లో వారు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కోక తప్పదన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే వారు ప్రజా సేవ చేయకుండా, సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలపై తప్పుడు కేసులతో వేధించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వేధింపులు భరించలేక, వారు చెప్పినట్లు అక్రమాలు చేయలేక నిజాయితీ కలిగిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు స్వచ్ఛందంగా రిటైర్‌మెంట్ ప్రకటించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. అక్రమ అరెస్ట్‌లతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జిల్లా ఎస్పీతో ప్రాణాలకు ముప్పు

బాస్ వ్యవస్థాపకుడు పీటీయం.శివప్రసాద్


పీటీయం.శివప్రసాద్ ఇంటికి నోటీసులు అతికిస్తున్న పోలీసులు

మదనపల్లె రూరల్ : బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసి, తలను వేరుచేసిన ఉన్మాదుల్ని పట్టుకోవడంలో ఘోరంగా విఫలమైన జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కేసును తప్పుదోవ పట్టించేందుకు తమపై తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారని భారతీయ అంబేద్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం.శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గుండె జబ్బుతో బాధపడుతూ, చికిత్స పొందుతున్న తనపై తప్పుడు కేసులు బనాయించి, తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని, ఎస్పీ వేధింపులతో తన ప్రాణానికి హాని కలిగే అవకాశం ఉందని, అదే జరిగితే దానికి ఆయనే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బుద్ధ విగ్రహం ధ్వంసం జరిగి 20 రోజులవుతున్నా, ఇప్పటికీ ఉన్మాదులను పట్టుకోకపోగా, నిరసన తెలుపుతున్న దళిత నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. శనివారం రాత్రి పోలీసులు తమ ఇంటికి వచ్చి, తలుపునకు మూడు నోటీసులు అతికించి వెళ్లారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన ఉన్మాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. దళితుడైన తనను తీవ్ర వేధింపులకు, అవమానాలకు గురిచేస్తూ, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లేలా చేసిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుపై కేసు నమోదుకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

మా పార్టీ వారే నాపై దాడి చేశారు

టీడీపీ బీసీ నేత రెడ్డి వరప్రసాద్


గాయపడిన టీడీపీ బీసీ నేత రెడ్డి వరప్రసాద్

రాయచోటి : తెలుగుదేశం పార్టీకి చెందిన మా వాళ్లే తన పైన దాడి చేసి తీవ్రంగా గాయపరచారంటూ టీడీపీ బీసీ నేత రెడ్డి వరప్రసాద్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. రాయచోటి పట్టణం, కొత్తపేటలోని వినాయక వీధి సమీపంలోని సంజీవిని మెడికల్ స్టోర్‌లో ఉన్న రెడ్డి వరప్రసాద్ తనపై కొంతమంది తెలుగుదేశం పార్టీ వారు ఆదివారం సాయంత్రం దాడికి తెగబడినట్లు మీడియా ముందు తెలిపారు. మెడికల్ స్టోర్‌లో ఉన్న తనను చితకబాది అక్కడున్న వీడియో పుటేజ్‌లను రికార్డింగ్ హార్డ్ డిస్క్‌ను తీసుకెళ్లిపోయారన్నారు. తాను 30 సంవత్సరాలుగా టీడీపీ కోసం పనిచేస్తున్నానని, స్థానికంగా ఉన్న నాయకులు టీడీపీ అధికారంలోకి వచ్చాక పక్క పార్టీ వారి దగ్గర డబ్బులు తీసుకొని పనులు కేటాయించడంపై తాను ప్రశ్నించానన్నారు. తాను ఒక బీసీ కులానికి చెందిన వ్యక్తినని, ఎస్సీ మహిళను వివాహం చేసుకొని మెడికల్ స్టోర్ నడుపుకుంటూ పార్టీ కోసం పనిచేస్తున్నానన్నారు. తమ పార్టీకి చెందిన కొంతమంది పనిగట్టుకొని తనపై సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టడం, బెదిరించడం చేశారన్నారు. తీవ్రంగా గాయపరిచిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తీవ్రంగా గాయపడిన రెడ్డి వరప్రసాద్‌కు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన జగన్నాథ్

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనలో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పురిటి బిడ్డ చనిపోయాడని..

పెద్దమండ్యం మండలం శివపురం గ్రామానికి చెందిన ప్రభుదేవా భార్య డి.లతమ్మ (25)కు ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే ఇటీవల కాన్పులో ఆమెకు ఇద్దరు మగ పిల్లలు కవలలుగా జన్మించారు. అందులో ఒక బిడ్డ అనారోగ్యం పాలై మృతి చెందాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని లతమ్మ మనస్తాపం చెంది ఆదివారం ఇంటివద్ద పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భార్య కేసు పెట్టి పుట్టింటికి వెళ్లిపోయిందని..

భార్య తనపై కేసు పెట్టి పుట్టింటికి వెళ్లిపోవడాన్ని భరించలేక భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కురబలకోట మండలం తిట్టు పంచాయతీ లక్కినేనిపల్లెకు చెందిన అమర్నాథ్ కుమారుడు జగన్నాథ్ (35) భార్య సుజాత కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త, అత్తింటి వేధింపులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీన్ని అవమానంగా భావించిన జగన్నాథ్ ఆదివారం ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

నలుగురు నిందితుల అరెస్ట్

బి.కొత్తకోట : బి.కొత్తకోట సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిరుమల అమరనాథ్ ఇంటిపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నారని సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. అమరనాథ్ స్థానిక పీటీఎం రోడ్డులో నివాసం ఉంటున్నారు. గతనెల 20న రాత్రి కొందరు వ్యక్తులు ఇంటివద్దకు వెళ్లి గొడవ చేశారు. ఇంట్లోంచి బయటకు రమ్మంటూ సవాళ్లు విసిరారు. బయటకు రాకపోతే మేమే ఇంటిలోకి వచ్చి చంపుతామంటూ బెదిరించారు. ఈ గొడవతో ఆందోళనకు గురైన అమరనాథ్ ఇంటిలోనే ఉండిపోయారు. గొడవ చేస్తున్న వారి అరుపులతో స్థానికులు ఇళ్లలోంచి బయటకు రావడంతో వీరు కారు, బైకులలో వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరిపాక ఈ ఘటనలో పాల్గొన్న బి.కొత్తకోటకు చెందిన కె.మహేష్ (30), పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఎం.సురేష్‌యాదవ్ (28), ములకలచెరువు మండలానికి చెందిన యేసుబాబు (34), బెంగళూరులో ఉంటున్న ఈ.వినోద్‌కుమార్ (25)లను పీటీఎంరోడ్డులోని మల్లెల క్రాస్ వద్ద అరెస్ట్ చేసి స్కార్పియో వాహనం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని రిమాండ్ కోసం ఆదివారం కోర్టుకు తరలించామన్నారు. ఈ కేసులో మదనపల్లె మండలానికి చెందిన కె.రవి పరారీలో ఉన్నాడని అతనికోసం గాలిస్తున్నామని తెలిపారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


రాయచోటి : మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన


రాజంపేట : మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

రాజంపేట : తమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంలేదంటూ మున్సిపాలిటి కార్మికులు చేపట్టిన నిరసన ఆదివారం ఐదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే తమ తలరాతలు మారుతాయని ఆశించామన్నారు. ఇప్పుడు ఆ ప్రభుత్వం నిట్టనిలువునా తమ పొట్టలు కొడుతోందన్నారు. సీఐటీయూ జిల్లా నేత చిట్వేలి రవికుమార్, కార్మిక నేతలు పీవీరమణ, లక్ష్మీదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసనలో సీఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తమకు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, జిల్లా కోశాధికారి సి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రహిత రుణాలే అమానత్ బ్యాంక్ లక్ష్యం



మాట్లాడుతున్న ఏఐ ఇస్లామిక్ ఫైనాన్స్ కార్యదర్శి జనాబ్ అబ్దుల్ రఖీబ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిరుపేదలకు వడ్డీ రహిత రుణాలు అందజేయడమే అమానత్ బ్యాంక్ ముఖ్య ఉద్దేశమని ఆల్ ఇండియా ఇస్లామిక్ ఫైనాన్స్ కార్యదర్శి జనాబ్ అబ్దుల్ రఖీబ్ తెలిపారు. ఆదివారం కడప నగరంలో అమానత్ మ్యూచువల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మూడో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న నిరుపేదలకు వడ్డీ రహిత రుణాలు అందజేసి వారు ఆర్థికంగా కుదుటపడేందుకు, వ్యాపారాలు వృద్ధి చేసుకునేందుకు ఈ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. 2019లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఇస్లామిక్ బ్యాంక్ ఆవశ్యకతను తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి ఆనాటి మేనిఫెస్టోలో ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు విషయాన్ని ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముతీకుర్రహ్మాన్, సంఘ సేవకులు సల్లావుద్దీన్, కడప ఇస్లామిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యగారిపల్లెలో చోరీ


బాధితుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ

నిమ్మనపల్లె : మండలంలోని కొండయ్యగారిపల్లెలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఘటనపై బాధితుడు పురుషోత్తం రెడ్డి ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పురుషోత్తం రెడ్డి కుటుంబంతో పాటు వ్యక్తిగత పనులపై బయట ప్రాంతానికి వెళ్లాడు. శనివారం రాత్రి ఇంటికి తిరిగి రాగా తలుపులు పగలగొట్టి ఉండడంతో, లోపలికి వెళ్లి పరిశీలించారు. బీరువాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని 49 గ్రాముల బరువు గల బంగారు చైన్ అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించారు. చైన్ విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ ఆదివారం బాధితుని ఇంటికి వెళ్లి చోరీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిని పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ తిప్పేస్వామి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు

ఒంటిమిట్ట : మండలంలో మంటపంపల్లి గ్రామంలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై ఈనెల 18న శుక్రవారం సాయంత్రం మహిళ మెడలోని గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. ఆదివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మహాత్మాగాంధీ జ్యోతీబాయి పూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మంటపంపల్లెకు చెందిన చింతల రాజ్యలక్ష్మి(42) మంటపంపల్లె జాతీయ రహదారి పక్కనే ఉన్న సెల్ టవర్ వద్దకు రాగానే గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని 30.5 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనలో గాయపడిన ఆమె నందలూరు ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొంది, ఆదివారం ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.